ప్రజాశక్తి
శుక్రవారం 16 ఫిబ్రవరి, 2024
5
శ్రీకాకుళం

ఎన్నికల విధులపై అలసత్వం వద్దు

ప్రజాశక్తి - నరసన్నపేట

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి కార్యాలయంలో రికార్డులను, అధికారుల పనితీరును పరిశీలించారు. మ్యూటిఫికేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఓటరు నమోదులో ఫారం-6 తీసుకునేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవాలని తహశీల్దార్‌కు సూచించారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండాలని ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నరసన్నపేట సచివాలయాన్ని పరిశీలించి పౌర సేవలపై ఆరా తీశారు.

పావనమూర్తికి పాలాభిషేకం

- ప్రారంభమైన రథసప్తమి వేడుకలు
- క్యూలైన్లలో బారులు తీరిన యాత్రికులు

విద్యుద్దీప వెలుగుల్లో అరసవల్లి ఆలయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెలుగులరేడు సూర్యనారాయణస్వామి రథసప్తమి (జయంత్యుత్సవం) వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం అర్ధరాత్రి 12.10 గంటలకు సుప్రభాత సేవ, ఉష:కాలార్చనతో వేడుకలు మొదలయ్యాయి. క్షీరాభిషేకం వేడుకలను కనులారా చూసేందుకు రాత్రి పది గంటల నుంచే ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లలో యాత్రికులు బారులు తీరారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా నుంచి యాత్రికులు చేరుకున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. దేవాదాయశాఖ రీజన్ జాయింట్ కమిషనర్ విజయకుమార్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో తయారు చేసిన పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో మూలవిరాట్టుకు క్షీరాభిషేకం చేశారు. స్వామి వారిని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం ఆరు గంటలకు నిజరూప దర్శనం ప్రారంభం కానుంది. కార్యక్రమంలో ఉత్సవ ప్రధాన అధికారి ఎం.వి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

నాలుగు స్లాట్లుగ దర్శన సమయం విభజ

రథసప్తమి వేడుకల్లో క్షీరాభిషేకం ప్రధాన ఘట్టం. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో విఐపిలు, వివిఐపిలు తరలివస్తారు. వారికి గతంలో ఉచిత పాస్‌లను జారీ చేసేవారు. అందుకు భిన్నంగా ఈసారి ఉచిత పాస్‌లను రద్దు చేశారు. వాటి స్థానంలో రూ.500 టిక్కెట్లను గతేడాది నుంచి ప్రవేశపెట్టారు. ఈ టిక్కెట్లు కొన్న వారికి క్షీరాభిషేకం, నిజరూప దర్శనం, అర్చనానంతర దర్శనం, పవళింపు సేవల్లో ఎప్పుడైనా వెళ్లేందుకు వీలుండేది. ఈసారి అలా కాకుండా టైం స్లాట్‌లను టిక్కెట్లపై ముద్రించి విక్రయించారు. యూనియన్ బ్యాంకు పరిధిలో వీటి అమ్మకాలు చేపట్టారు. ఆర్‌డిఒ కార్యాలయం నుంచి అనుమతి లేఖ తెచ్చుకున్న వారికే నిర్దేశించిన ప్రకారం టిక్కెట్లు విక్రయించారు. అయితే మొదటి టైం స్లాట్ టిక్కెట్లను తమకు అనుకూలమైన వారి కోసం బ్లాక్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రథసప్తమి వేడుకకు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి జి.ఆర్ రాధిక

అరసవల్లిలో రథసప్తమి వేడుకకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. బందోబస్తు విధులు నిర్వహించ డానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్‌పి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దర్శన మార్గాలు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వచ్చిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తించాల న్నారు. యాత్రికుల దర్శనానికి, వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుం డా ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేసే రథసప్తమి వేడుక ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వహించాలన్నారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లలో దర్శనానికి అనుమతిం చాలని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక దర్శనం క్యూలైన్ ద్వారా దర్శనం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు పార్కింగ్ చేసుకునేందుకు 80 అడుగుల రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాతలు, విఐపి, వివిఐపిలకు ప్రత్యేక దర్శన మార్గాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాత్రికులు, విధులు నిర్వహించడానికి వచ్చిన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం లేకుండా వైద్య శిబిరాలు, మంచినీళ్ల ఏర్పాటు చేసి అవసరానికి తగ్గట్టుగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇద్దరు అదనపు ఎస్‌పిల పర్యవేక్షణలో తొమ్మిది మంది డిఎస్‌పిలతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తంగా సుమారు 1300 మంది సిబ్బందితో బందోబస్తును రెండు సెక్టార్లుగా విభజించామన్నారు. బందోబస్తును విజయవంతం గా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిబ్బంది ఎవరికి నియ మించిన స్థానాల్లో అప్పగించిన విధులు నిర్వర్తించి, యాత్రికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి ఎటువంటి తోపులాట్లు, అవాంతరాలు లేకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించి బందోబస్తును విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు జి.ప్రేమకాజల్, బి.ఉమామహేశ్వరరావు, డిఎస్‌పిలు వై.శృతి, డి.బాలచంద్రారెడ్డి, ఎ.విజయ్‌కుమార్, ఎం.వీర కుమార్, ఎస్.ఆర్ హర్షిత, ఆర్.శ్రీనివాసరావు, విశ్వనాథం, సిఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె

- సమాయత్తమైన కార్మికులు, రైతులు
- మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, వామపక్షాలు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘీభావం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన శుక్రవారం గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె చేపట్టేందుకు రైతులు, కార్మికులు సమాయత్తమవుతున్నారు. బంద్‌పై ఇప్పటికే విస్తృత ప్రచారం చేపట్టారు. పారిశ్రామికవాడతో పాటు జిల్లాలో ఉన్న జీడి, గ్రానైట్, రైస్‌మిల్లులు తదితర పరిశ్రమల యజమానులకు సమ్మె నోటీసు ఇచ్చారు. గ్రామీణ బంద్ నేపథ్యాన్ని వివరిస్తూ ఊరూరా కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామాల నుంచి పట్టణాల్లోకి కూరగాయలు, పాలు తీసుకువెళ్లకుండా సమ్మెలో పాల్గొనాలని కోరారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ, వామపక్షాలు మద్దతు పలికాయి. బిఎస్‌ఎన్‌ఎల్, పోస్టల్, ఇన్సూరెన్స్ తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెకు సంఘీభావం ప్రకటించాయి

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు ర్యాలీ

బంద్‌లో భాగంగా పారిశ్రామిక కార్మికులు ఆధ్వర్యంలో శుక్రవారం పలురూపాల్లో నిరసన చేపట్టనున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసన ప్రదర్శనలు చేయనున్నారు. శ్రీకాకుళం నగరంలో ఉదయం పది గంటలకు ఏడు రోడ్ల కూడలి నుంచి ప్రదర్శన చేపట్టనున్నారు. పలాసలో ఉదయం పది గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం పాతబస్టాండ్ వద్ద సభ నిర్వహించనున్నారు.

సత్కరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించడంలో వాలంటీర్ల వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తోందని, వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వాలంటీర్లు సేవలు అందిస్తున్నారని, బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మరింత మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

జిల్లాలో సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు పొందిన గ్రామ, వార్డు వాలంటీర్లు 12,123 మంది ఉన్నారని తెలిపారు. వీరికి సర్టిఫికేట్, శాలువా, బ్యాడ్జి, మెడల్‌తో పాటు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం వాలంటీర్లకు గతం కంటే ప్రోత్సాహకాలను పెంచిందని సేవా వజ్ర నగదు పురస్కారం పొందిన 40 మందికి రూ.45 వేల చొప్పున బహుమతి, సేవారత్న నగదు పురస్కారం పొందిన 171 మందికి రూ.30 వేలు చొప్పున సేవామిత్ర పురస్కారం పొందిన 11,192 మందికి రూ.15 వేల చొప్పున బహుమతి ఉంటుందన్నారు. వాలంటీర్లకు వందనం పేరుతో జిల్లాకు కేటాయించిన అవార్డుల మొత్తం రూ.18,56 కోట్లని ప్రకటించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పలువురు వాలంటీర్లు బంగారు ఉమా శంకర్ (దండివేసి), హేమలత (అరసవల్లి), బంటుపల్లి లక్ష్మణ్ (కొర్ని), గురుగుబెల్లి శివాజీ (ఆమదాలవలస), బర్రి లక్ష్మి (పొందూరు), బి.పాపారావు (జలుమూరు), కింజరాపు కిశోర్ (ఎచ్చెర్ల)కు సేవావజ్ర పురస్కారాలను కలెక్టర్ ప్రదానం చేశారు. ఈ అవార్డు వారిలో మరింత బాధ్యత పెంచుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు రోజుల పాటు వాలంటీర్లకు వందనం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లాపరిషత్ సిఇఒ డి.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి అప్పన్న, పలువురు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

తోటపల్లిని పూర్తి చేస్తాం

- అభివృద్ధి కేంద్రంగా ఉన్న ఎచ్చెర్లను అవినీతిమయం చేశారు
- సొంత పార్టీ నాయకులనూ హత్య చేస్తున్నారు
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్
- జిల్లాలో ముగిసిన శంఖారావం యాత్ర

మాట్లాడుతున్న లోకేష్

సభలో పాల్గొన్న టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, లావేరు

టిడిపి-జనసేన ప్రభుత్వాన్ని గెలిపిస్తే తొలి ఏడాదిలోనే తోటపల్లి పెండింగ్ కాలువ పనులను పూరి చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీనిచ్చారు. ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈనెల 11న ఇచ్ఛాపురంలో ప్రారంభమైన శంఖారావం యాత్ర లావేరులో గురువారం నిర్వహించిన ఎచ్చెర్ల నియోజకవర్గ సభతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ టిడిపి హయాంలో ఎచ్చెర్లలో ట్రిపుల్ ఐటికి 200 ఎకరాలు కేటాయించామని, ఆ పనులనూ యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. అంబేద్కర్ యూనివర్సిటీలో స్టేడియం నిర్మిస్తామని హామీనిచ్చారు. బుడగట్లపాలెంలో జెట్టీ నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు చేయలేదన్నారు. టిడిపి వస్తే వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. మత్స్యకారులకు అనేక సబ్సిడీలు రద్దు చేశారని, వాటిని అమలు చేస్తామని హామీనిచ్చారు.

సొంత పార్టీ నాయకులనూ హత్య చేస్తున్నారు

వైసిపి నాయకులు సొంత పార్టీ నాయకులను హత్య చేసే స్థితికి వచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపిపి ఏకంగా వాళ్ల పార్టీకే చెందిన వైస్ ఎంపిపి ప్రతినిధి జరుగుల శంకర్‌ను చంపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అభివృద్ధి కేంద్రంగా ఉన్న ఎచ్చెర్లను అవినీతిమయంగా మార్చారని విమర్శించారు. నియోజకవర్గాన్ని కేట్ కట్ చేసినట్లుగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ఒక్కొక్కరికీ ఒక్కో ప్రాంతం ఇచ్చి దోచుకోమంటున్నారని ఆరోపించారు. ఒక్క ఇసుకలోనే రూ.50 కోట్లు దోచుకున్నారని, నాలుగు కొండలు మింగేశారని చెప్పారు. సొంత ఊరిలో నకిలీ పత్రాలు సృష్టించి భూములు దోచుకున్నారని ఆరోపించారు. రెండు నెలలు ఓపిక పడితే వీటిపై విచారణ చేపట్టి, ఆ భూములను గ్రామస్తులకు తిరిగి ఇప్పించే బాధ్యత తీసుకుంటామన్నారు.

దుర్మార్గ పాలనను అంతమొందించాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి కళా వెంకటరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లుగా పంటలకు సాగునీరు అందించకపోవడంతో రైతులు రూ.600 కోట్లు నష్టపోయారని విమర్శించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక, తప్పుడు విధానాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన వైసిపి ప్రభుత్వాన్ని ఓడించి, దుర్మార్గ పాలనను అంతమొందించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే మా భూమిని ఆక్రమించారు

రణస్థలం మండలం కోటపాలెంకు చెందిన పలువురు లోకేష్‌ను కలిశారు. కోటపాలెంలో వందెకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని టిడిపి ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని 15 గ్రామాల పేదలకు పంచాలని నిర్ణయించిందని వివరించారు. గ్రామస్తులు సొంత ఖర్చులతో భూమిని చదును చేసుకొని సిద్ధం చేసుకున్నారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పూర్వీకుల ద్వారా తమకు భూమి సంక్రమించిందని తీసుకున్నారని తెలిపారు. టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంబంధిత భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచేలా చర్యలు తీసుకుంటామని లోకేష్ హామీనిచ్చారు. సభలో టిడిపి విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' ప్రదర్శన నిలిపివేత

ప్రజాశక్తి - పలాస, శ్రీకాకుళం అర్బన్

'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనను రెవెన్యూ అధికారులు గురువారం అర్ధాంతరంగా నిలిపివేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని భాస్కరరామా థియేటర్‌లో ఈ సినిమాను ప్రదర్శిస్తుండగా రెవెన్యూ, పోలీసులు అధికారులు వెళ్లి చిత్రాన్ని ప్రదర్శించవద్దని నోటీసులు ఇచ్చారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో చిత్ర ప్రదర్శనను నిలిపివేయాలని యాజమాన్యానికి చెప్పడంతో మధ్యలోనే సినిమా ప్రదర్శనను ఆపేశారు. సుమారు గంటపాటు సినిమా ప్రదర్శించి అర్ధాంతరంగా నిలిపివేయడంతో ప్రేక్షకులు ఎందుకు సినిమాను నిలిపివేశారో తెలియక కేకలు వేశారు. టిక్కెట్లు కొని చూస్తుంటే మధ్యలో ఎలా నిలిపివేస్తారని నిలదీశారు. చివరకు థియేటర్ యాజమాన్యం ప్రేక్షకులకు టిక్కెట్ల డబ్బులను తిరిగి ఇచ్చివేసింది.

శ్రీకాకుళం నగరంలోని కీర్తిక థియేటర్‌తో పాటు పలుచోట్ల సినిమా ప్రదర్శనను నిలిపివేయాలని అధికారులు నోటీసులు ఇవ్వడంపై టిడిపి నాయకులు మండిపడ్డారు. రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతాంగం కష్టాలను ప్రతిబింబించే రీతిలో నిర్మించిన రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం ప్రభుత్వ కక్షసాధింపులో భాగమేనని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ విమర్శించారు. వైసిపి ప్రభుత్వ నియంత పాలనకు ఇది నిదర్శనమన్నారు. యాత్ర, యాత్ర-2 వంటి సినిమాలను థియేటర్లలో ప్రదర్శించవచ్చు గానీ రాజధాని విషయంలో వాస్తవాలను వెల్లడించే ఇటువంటి సినిమాలు ప్రదర్శించకూడదా అని ప్రశ్నించారు. ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడానికి మూడు రాజధానులు అన్నారని, వాటికి కనీసం పునాదిరాయి వేయలేక ఎన్నికల వేళ హైదరబాద్ ఉమ్మడి రాజధాని అంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, టిడిపి నాయకులు ఇప్పిలి తిరుమలరావు, రెడ్డి శంకర్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా



శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యాన నగరంలో డిఎల్‌టిసి, ప్రభుత్వ ఐటిఐ ఆవరణలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి శాఖాధికారి కొత్తలంక సుధ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్ మేళాకు క్యాలిబర్, ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని అర్హులైన అభ్యర్థుల ఉద్యోగ నియామకాలు చేపడతారని తెలిపారు. క్యాలిబర్ కంపెనీలో 80 ఖాళీలున్న ఎగ్జిక్యూటివ్, టెలికాలర్ పోస్టులకు నెలకు రూ.15వేలు నుంచి రూ.25వేల వేతనంతో కూడిన ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఆపైన విద్యార్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల స్త్రీ,పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో 70 ఖాళీలు ఉన్నాయని, రిలేషన్‌షిప్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు నెలకు రూ.15 వేలు నుంచి రూ.25 వేలు వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఆపైన విద్యార్హత కలిగిన 19 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకొని జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ విద్యార్హత వివరాలను www.NCS.GOV.IN వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

భోజన విరామ సమయంలో ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న ఎపి జెఎసి నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎపి జెఎసి జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం విమర్శించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ ఎపి జెఎసి ఆధ్వర్యాన ఉద్యోగులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్‌సిలో 30శాతం ఫిట్‌మెంటు వెంటనే ప్రకటించాలని, సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ వారికి డిఎ బకాయిలు 90 శాతం నగదు రూపంలో చెల్లించాలన్నారు. 11వ పిఆర్‌సిలో ఇప్పటికీ ఎరియర్స్, సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లయిమ్‌లు వెంటనే చెల్లించాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో ప్రవేశపెట్టిన అప్రెంటిషిప్‌ను రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. గురుకులాలు, సొసైటీ లు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, గతంలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు సామాజిక భద్రత కింద కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు బి.పూర్ణచంద్రరావు, ట్రెజరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : తహశీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఉద్యోగుల డిఎలు, ఐఆర్, పిఆర్‌సి బకాయిలు, ఎరియర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ టి.శంకరరావుకు వినతి పత్రం అందజేశారు. ఆర్‌ఐ వైకుంఠరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణారావు, అన్నాజీరావు, రమణ, హిమగిరి, మాధవ్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

టెక్కలి : పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. టెక్కలి సబ్ ట్రెజరీ కార్యాలయ ఉద్యోగులతో పాటు పలు కార్యాలయాల ఉద్యోగులు నిరసన తెలిపారు.

సైన్స్‌తో సమాజాభివృద్ధి

డిఇఒ వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

శాస్త్ర సాంకేతిక విద్య ద్వారా సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జిల్లా పాఠశాల విద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం 11వ జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో భాగంగా 'ఇన్స్పైర్ మన అవార్డ్ 2022-2023 ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్ర-సాంకేతిక పరిష్కారాలు చూపడమే వైజ్ఞానిక విద్యని పేర్కొన్నారు. పూర్వకాలంలో గాలికోసం విసన కర్రలను వినియోగించేవారమని, వాటి స్థానంలో నేడు ఫ్యాన్లు, ఎసిలను వినియోగిస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లే రైతులకు ఉపయోగపడే 'కర్ర'ను ఇటీవల ఒక వ్యక్తి తయారు చేశాడని దానిలో వైబ్రేషన్‌తో కూడిన లైట్, ప్రాథమిక చికిత్స పరికరాలను అమర్చారన్నారు. ఇటువంటి నూతన ఆలోచనల ద్వారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులకు కోరారు. 164 ప్రాజెక్టులు ప్రదర్శనకురాగా వీటిలో 16 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి బహుమతులను, ప్రశంసాపత్రాలను అందిస్తామని, రాష్ట్రస్థాయి పోటీలకు, అక్కడ ఎంపికైతే జాతీయ స్థాయి పోటీలకు ఈ ప్రాజెక్టులు వెళ్లే అవకాశం ఉందని వివరించారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యతను అధ్యాపకులు తీసుకోవాలన్నారు. పరీక్షల్లో మార్కుల కోసం కాకుండా విషయం తెలుసుకొనేందుకు చదవాలన్నారు. అపజయాలు విజయానికి సోపానాలుగా భావించి ప్రయోగాల్లో ముందుకు వెళ్లాలని డైరెక్టర్ హితవు పలికారు. ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి మాట్లాడుతూ ఒక మంచి ఆలోచనను ప్రాజెక్టుగా మార్చుటకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థికి రూ.10వేలు ఇస్తుందన్నారు. విద్యార్థులు ఈ రంగంపై ఆసక్తి పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వైజ్ఞానికి అధికారికుమార స్వామి, డాక్టర్ ఆర్.శ్రీరాములు, ఎన్‌ఐఎఫ్ జూనియర్ శాస్త్రవేత్త అభినాష్ సమాల్ మాట్లాడుతూ రైతులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారాలు చూపాలన్నారు.

పలాస : గంగువాడలో 'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న మోహనరావు

సమ్మె విజయవంతంపై ప్రచారం

పలాస : మండలంలోని గంగువాడ, కేదారిపురం, పెదంచల, చినంచల, గోదావరిపురం తదితర ప్రాంతాల్లో ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్ విజయవంతంపై ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి ప్రచారం చేపట్టి ఉపాధి కూలీలతో మాట్లాడారు. అనంతరం వామపక్ష నాయకులు కాశీబుగ్గ సంత మైదానంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, వంకల మాధవరావు, మద్దిల రామారావు, తామడ సన్యాసిరావు పాల్గొన్నారు.

మందస: ఈ నెల 16న పారిశ్రామిక, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు ఎం.ధర్మారావు, ఆర్.దిలీప్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మందసలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను అవలంబిస్తుందని అన్నారు. మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించేందుకు ఈ ధర్నా చేస్తున్నామని అన్నారు. పి.అప్పలస్వామి, బి.రామయ్య, కె.జయరాం పాల్గొన్నారు.

నారాయణమ్మకు నగదును అందజేస్తున్న నాయకులు

యుబి కార్మికుల దాతృత్వం

రణస్థలం: మండలంలోని యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ఎస్.మాలచ్చి అనారోగ్యంతో చనిపోయారు. స్పందించిన తోటి కార్మికులంతా యునైటెడ్ బ్రెవరీస్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో తమ ఒకరోజు వేతనం రూ.2,40,105 విరాళంగా సేకరించారు. ఈ నగదును చనిపోయిన కార్మికుడి కుటుంబసభ్యులకు గురువారం పరిశ్రమ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, యునైటెడ్ బ్రెవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ కార్మికులకు యాజమాన్యం పూర్తిస్థాయి పనిదినాలు కల్పించకపోయినా తమ ఒకరోజు వేతనం విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. సిఐటియు సభ్యులు హక్కులుకోసం పోరాటాలే కాకుండా తోటి కార్మికులను ఆదుకోవడంలో ముందుంటారన్నారు. ఈ విరాళాన్ని మరణించిన కార్మికుడి భార్య నారాయణమ్మకు అందజేసారు. కార్యక్రమంలో వెలమల రమణ, సత్యనారాయణ తదితరులున్నారు.

స్త్రీశక్తి భవనానికి మోక్షమెప్పుడో?

- శిలాఫలకాలకే పరిమితం
- మహిళా సంఘాల సమావేశాలకు ఇబ్బందులు
- పాలకులు, అధికారులకు పట్టని మహిళల అవస్థలు

ప్రజాశక్తి - పొందూరు

మహిళా సాధికారితే తమ లక్ష్యమని, మహిళా అభ్యుదయానికి, మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటు అందిస్తుందంటూ పాలకులు సమావేశాల్లో పదేపదే చెప్పడం పరిపాటి. మహిళా సాధికారత, ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘాల నిర్వాహణ, కార్యకలాపాలు, సమావేశాల నిర్వాహణకు అనువైన కార్యాలయం లేదు. దశాబ్ధాలు గడుస్తున్నా పొందూరు వెలుగు కార్యాలయానికి శాశ్విత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2011 నుంచి వెలుగు కార్యాలయానికి శాశ్విత భవనం నిర్మాణం జరిపేందుకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు వేస్తున్నారే తప్ప భవన నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో మహిళలు సమావేశాలు ఏర్పాటుకు, సంఘాల నిర్వాహణకు నానా అవస్థలు పడుతున్నారు.

దర్శనమిస్తున్న శిలాఫలకాలు

ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వెలుగు కార్యాలయ భవన నిర్మాణం చేసేందుకు 2011లో సమైక్య ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అనంతరం 2019లో రూ.40లక్షలతో భవన నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పటి ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి పునాదులు వేసి వదిలివేశారు. దీంతో ఇరువురు వేసిన శిలాఫలకాలే మిగిలాయి తప్ప భవనం నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు.

సమావేశాలకు అవస్థలు...

మండలంలో 1739 మహిళా పొదుపు సంఘాలు ఉండగా, ఇందులో సుమారు 22వేల మంది సభ్యులున్నారు. అలాగే 46 మంది విఒఎలు, నలుగురు సిసిలు, ఎపిఎంలు ఉన్నారు. మహిళా సాధికారత కోసం విరివిగా వివిధ రూపాల్లో రుణాలను ప్రభుత్వాలు మహిళలకు అందజేస్తున్నాయి. ఈ రుణాలను సద్వినియోగపర్చు కునేందుకు మహిళలకు అవగాహన సమావేశాలను నిర్వహిస్తుంటాయి. ఈ సమావేశాలు నిర్వాహణకు అనువైన భవనం లేకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుందంటూ పేర్కొంటున్నారు. ఇరుకైన గదిలోనే ఇబ్బందులు పడుతూ కూర్చోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ అవసరాల కోసం వచ్చే మహిళలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు అనువుగా మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామంటూ వాపోతున్నారు. తమ సమస్యలు పాలకులు, అధికారులకు పట్టడం లేదంటూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చిమొక్కలతో నిండిపోయిన పునాదులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

వెలుగు కార్యాలయానికి శాశ్విత భవనం నిర్మాణానికి సంబంధించి పునాదులు వేసి వదిలివేశారు. కార్యక లాపాలు నిర్వాహణకు అనువుగా లేకపోవడంతో ఇరుకైన గదిలోనే సమావేశాలు, రికార్డుల నిర్వాహణ చేయాల్సి వస్తుంది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళ్లాం.

- జి.శ్యామలరావు, ఎపిఎం, వైఎస్ఆర్ క్రాంతి పథం, పొందూరు

తొలగించిన సిఎఫ్ దర్జాగా విధులు!

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట సిఎఫ్ పరపటి సుమలత అవినీతికి పాల్పడడంతో ఇటీవల తొలగించారు. అయినా మళ్లీ దర్జాగా విధుల్లోకి చేరింది. వివరాల్లోకి వెళ్తే... సిఎఫ్ సుమలత రూ.2,40,000 తన సొంత ఖాతాలో వేసుకుని అక్రమాలకు పాల్పడడంతో దీనిపై స్పందనలో అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెలుగు అధికారులు విచారణ చేయగా, రూ.2,40,000 అవినీతి చేసినట్లు గుర్తించి సి ఎఫ్ సుమలతను తీర్మానం చేసి తొలగించారు. ఆమె స్థానంలో ఇన్‌ఛార్జిగా సీతానగరం సిఎఫ్ తార సుధారాణికి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయా గ్రూపుల్లోని మహిళలతో ఇకెవైసిలు, డాక్యుమెంట్ల సేకరణ, గ్రూపుల సర్వే పనులు చేపడుతున్నారు. అంతవరకు బాగానే ఉన్నా... ఆసరా సొమ్ము పొదుపు ఖాతా నుంచి వ్యక్తిగత ఖాతాలోకి జమ కావాలంటే బ్యాంకులో ఆన్‌లైన్ ద్వారా సంబంధిత సిఎఫ్ కంప్యూటర్‌లో నమోదు చేయాల్సి ఉంది.అయితే నౌపడ స్టేట్ బ్యాంకులో అలా జరగలేదు. తొలగించిన సిఎఫ్ సుమలత బ్యాంకు కూర్చుని కంప్యూటర్‌లో లక్షలాది రూపాయల ఆసరా సొమ్ము నమోదు చేయాలని అప్పగించారు. తొలగించిన సిఎఫ్ పనిచేయడంపై మహిళా సంఘాల సభ్యులు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. మన డబ్బులు మనకు ఇవడానికే సవా లక్ష కొర్రీలు పెట్టే బ్యాంకు అధికారులు తొలగించిన సిఎఫ్‌కు మహిళా సంఘాలకు సంబంధించిన ఆన్‌లైన్ ఖాతాలు ఎలా అప్పగించారన్న దానిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నౌపడ స్టేట్ బ్యాంకు మేనేజర్ మధుసూదనరావును సంప్రదించగా, వెలుగు ఎపిఎం సూర్యనారాయణ చెప్తేనే... సుమలతకు బ్యాంకులో ఆసరా సొమ్ము నమోదు చేయమని కంప్యూటర్ అప్పగించినట్లు తెలిపారు. దీనిపై ఎపిఎం సూర్యనారాయణను అడుగగా నౌపడ స్టేట్ బ్యాంకులో సుమలత పనిచేస్తే నాకేం సంబంధం లేదని, నేను ఎవరికీ ఏమీ చెప్పలేదని, దీనిపై బ్యాంకు అధికారులతో మాట్లాడుతానని సమాధానం ఇచ్చారు.

పోరాటానికి సిద్ధం

మెళియాపుట్టి : మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యల పరిష్కార సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని జిల్లా యూనియన్ అధ్యక్షులు సుశీల పిలుపునిచ్చారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో వంట కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని అన్నారు. సమస్యల పరిష్కారానికి గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ నేటికీ హామీ నెరవేరలేదని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సురయ్య, మంగమ్మ, సీతమ్మ, ఆదిలక్ష్మి, చామంతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుశీల

కిడ్నీ వ్యాధితో మాజీ సర్పంచ్ మృతి

శార్వాణి (ఫైల్)

వజ్రపుకొత్తూరు : మండలంలోని చినవంక మాజీ సర్పంచ్ దువ్వాడ శార్వాణి (63) గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ పలాసలోని ప్రయివేట్ ఆస్పత్రిలో బుధవారం రాత్రి మృతి చెందారు. 2013 నుంచి 2018 వరకు చినవంక సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం ఈమె కోడలు దువ్వాడ విజయలక్ష్మి చినవంక సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఈమె కుమారుడు దువ్వాడ హేమబాబు చౌదరి వజ్రపుకొత్తూరు పిఎసిఎస్ చైర్మన్‌గా సేవలు అందించి ప్రస్తుతం టిడిపిలో కొనసాగుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మృతి కుటుంబ సభ్యులు హేమబాబు చౌదరిని పరామర్శించారు. ముందుగా శార్వాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, బగాది రాజారావు ఉన్నారు. అలాగే జనసేన నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు, కళింగ సేవా సంఘం ప్రతినిధులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, బమ్మిడి నాగేశ్వరరావు, బగాది సింహాచలం, కంచరాన బుజ్జి, బమ్మిడి ఆనందరావు, బి. సాంబమూర్తి కూడా పరామర్శించారు.

గాయపడిన దీపక్‌నాయక్, దుర్గారావు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని రైల్వే అండర్ టన్నెల్ వద్ద రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... గురువారం సాయంత్రం అండర్ టన్నెల్ నుంచి బైక్‌పై ఒడిశా రాష్ట్రానికి చెందిన దీపక్ నాయక్ ఎస్ఆర్ డాబ లో కుక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే మెయిన్ రోడ్ నుంచి గేటు వైపు వెళుతున్న పురపాలక సంఘ పరిధిలోని ఆరో వార్డు పరిధిలో ఉన్న టి.మన్నయ్యపేటకు చెందిన జాడ దుర్గారావు అతి వేగంతో వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని చెల్లా చెదురుగా పడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.

ఐదున్నర తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలంలో విజయరాంపురం గ్రామానికి చెందిన కూటికుప్పల మోహనరావు ఇంట్లో ఐదున్నర తులాల బంగారం చోరీ జరిగింది. గురువారం మధ్యాహ్నం భోజనం చేసి మోహనరావు ఆయన భార్య 3 గంటల సమయంలో పొలం పనులకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి ఇంటికి చేరుకుని చూసేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంటి లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తలుపులు తెరచి ఉండడాన్ని గమనించిన మోహనరావు దంపతులు బంగారం పోయిన విషయాన్ని గ్రహించి లబోదిబోమంటూ చుట్టుపక్కల వారికి చెప్పి సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15.30 లక్షలకు వేలం ఖరారు

వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్ నాగేంద్రబాబు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ వేలం పాటలు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ మేరకు రూ.15.30 లక్షలకు అత్యధికంగా ఎరుగ మోహనరావు పాట పాడి దక్కించుకున్నారు. మార్కెట్ ఆశీలు పాటలో ఎరుగు మోహనరావు, పట్ట భైరాగి అనే వ్యక్తులు పోటాపోటీగా పాటపాడారు. అందులో భైరాగి రూ.15.29 లక్షలకు పాట పాడి విరమించారు. ఎరుగ మోహనరావు రూ.15.30 లక్షలకు పాట పాడి మార్కెట్ వేలం పాటను దక్కించుకున్నారు. అదేవిధంగా జంతువధ శాల కోసం మీరాఖాధిర్ హుస్సేన్, అబ్బుల్ రాజేష్ ఖాన్ పోటాపోటీగా పాట దక్కించుకునేందుకు ప్రయత్నం చేయగా, రూ.43.500కు పాట పాడి మిరాఖాధిర్ హుస్సేన్ నిలిచిపోవడంతో, అబ్దుల్ రాజేష్ ఖాన్ రూ.45 వేలకు పాట పాడి జంతువధశాల వేలం పాటను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ గజిట్ ప్రకారమే ఆశీలును వసూలు చేయాలని, ధరల టిక్కెట్లపై తప్పరి సరిగా మున్సిపల్ ముద్ర ఉండాలని సూచించారు. ఎక్కడైనా అక్రమంగా వసూళ్లకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వేలం పాటలలో ఆర్ఐలు అప్పలస్వామి, అమర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - బూర్జ

గృహ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ అధికారి గణపతిరావు సూచించారు. గురువారం పెదలంకాం, వావాం గ్రామాల్లో గృహ నిర్మాణాల లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారితో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మాణాల కోసం లబ్ధిదారులకు ఎన్నో అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణాల్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. గహాలు మంజూరైనప్పటికీ ఇంతవరకు పనులు చేపట్టని వారి వివరాలను నమోదు చేసినట్లయితే వారి స్థానంలో వేరొకరికి అవకాశం కల్పించాలన్నారు. అలాగే లబ్ధిదారులకు మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలన్నారు. ఆయనతో పాటు ఎఇ కె.లక్ష్మీనారాయణ, వర్క్ ఇన్స్‌పెక్టర్లు ఎం.రాంప్రసాద్, ఎస్. మదన్ మోహనరావు, పురుషోత్తమరావు, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ గణపతిరావు

కుష్టురహిత సమాజానికి కృషి

వైద్య పరీక్షలు చేస్తున్న రవీంద్ర కుమార్

ప్రజాశక్తి - జి.సిగడాం

కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుష్టువ్యాధి ఫిజియోథెరపిస్ట్ రవింద్రకుమార్ అన్నారు. గురువారం జి.సిగడాం పిహెచ్‌సి పరిధిలో ఆనందపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి కుష్టు వ్యాధి, వాటి లక్షణాలపై ప్రజలకు వివరించారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలపై హెల్త్ అసిస్టెంట్ పేడాడ సత్తిరాజు, ఎఎన్ఎమ్ నాగమణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి వైద్య సిబ్బంది సేవలు అందించాలన్నారు. రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందన్నారు. కార్యదర్శి పైల జైరాం, ఆరోగ్య సిబ్బంది పద్మ, చిన్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తవలసలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై స్వయంశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంలో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేయించరాదన్నారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైతే 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ సిసి ఇ.వి.రమణ, వై.రామప్పుడు, ఎం.చంద్రరావు, విఒఎ భారతి, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

భరద్వాజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని

అంధత్వం అడ్డంకి కాదు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మనిషి జీవితంలో ముఖ్యమైనవి ఒకటి పుట్టినరోజైతే, రెండోది మనల్ని మనం తెలుసుకున్న రోజని ఆమదాలవలస మండలం దూసి జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం దూసి సూర్యవిజయ భరద్వాజ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనల్ని మనం మార్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని విద్యార్థులకు సూచించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం అనే అంశాలపై అవగాహన కల్పించారు. తాను ఏడో ఏటనే కంటిచూపును కోల్పోయానని, కృంగిపోకుండా విజయం సాధించగలిగానని విద్యార్థులకు స్ఫూర్తి కలిగించారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలను అవకాశాలుగా మలచుకోవాలని సూచించారు. తాను అంధుడనైనా ఎంతోమంది విద్యార్థులకు విద్య ద్వారా వెలుగులు నింపుతున్నానని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు విజయావకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు మాట్లాడుతూ భరద్వాజ మాస్టారు సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారని పేర్కొన్నారు. లాస ఫౌండేషన్ ద్వారా రూ.కోట్లాది విలువైన కార్యక్రమాలను అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.నాగేంద్ర, డి.రామకృష్ణ, లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు వినోద్‌రాజు, విజయ, సంగీత, విజయ్, గౌతమి, తారాచంద్, సీనియర్ అసిస్టెంట్ కె.కమలాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా!

ప్రజాశక్తి - ఆమదాలవలస

నియోజకవర్గ అభివృద్ధిపై వైసిపి యువజన నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ సిద్ధమా అని రాష్ట్ర టిడిపి న్యాయ విభాగం కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ ప్రశ్నించారు. గురువారం పట్టణంలో టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూన రవికుమార్‌పై చేసిన ఆరోపణలపై ధ్వజమెత్తారు. క్రమశిక్షణకు, పరిపాలన దక్షతకు మారుపేరైన చంద్రబాబును విమర్శించే స్థాయి పిల్ల నాయకుడుకు లేదన్నారు. పట్టణంలో నిర్వహించిన లోకేష్ శంఖారావం కార్యక్రమంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గంలో రవికుమార్ ఎటువంటి అభివృద్ధి చేయలేదని తన తండ్రి సీతారాం అభివృద్ధి చేశాడంటూ ప్రగల్భాలు పలకడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. నారా లోకేష్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రవికుమార్ చొరవతో పొందూరు మండలంలో రహదారుల అభివృద్ధికి రూ.44 కోట్లు మంజూరు చేస్తే ఆ రహదారులపై నేడు నిర్వాహణ పనులు చేస్తూ వైసిపి ప్రభుత్వం రోడ్లు వేసిందని, చేస్తున్న అబద్ధపు ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు. మున్సిపాలిటీలో రవికుమార్ హయాంలో టిడిపి ఆధ్వర్యంలో రూ.242 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వైసిపి హయాంలో ఎంత ఖర్చు చేసారో చెప్పగలరా అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్, రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి బోర గోవిందరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

'వైసిపిలో ఉన్న వారంతా టిడిపి నాయకులే'

రాజశేఖర్

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన పంచాయతీకి చెందిన వైసిపి ఎంపిటిసి నంబాళ రాజశేఖర్ గతంలో ఏ పార్టీకి చెందిన నాయకుడో ఎంపిపి, వైసిపి నయకులకు తెలుసని జనవనరుల శాఖ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, టిడిపి నాయకులు కర్రి అప్పారావు అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి నాయకులే వైసిపికి వెళ్లి... మళ్లీ టిడిపికి వెళ్తున్నారని మాట్లాడడం సరికాదన్నారు. ప్రస్తుతం వైసిపి ఉన్న చాలా మంది నాయకులు గతంలో టిడిపి ఉన్నావారేనని పేర్కొన్నారు. రాజశేఖర్ ఇప్పుడు వైసిపి, గతంలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.

ఒకే రాష్ట్రం... ఒకే రాజధాని

ప్రజాశక్తి - నరసన్నపేట

అమరావతి రాజధాని కోసం భూములు త్యాగం చేసిన వేలాది మంది రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తెరకెక్కించిన చిత్రం 'రాజధాని ఫైల్స్' విడుదల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యాన టిడిపి కార్యాలయం నుంచి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఒకే రాష్ట్రం... ఒకే రాజధాని అంటూ నినదాలు చేశారు. రాజేశ్వర్ కళామందిర్ చేరుకొని సినిమా విక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధాని ఫైల్స్ సినిమా ప్రతిఒక్కరూ వీక్షించాలని కోరారు. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులు పడుతున్న కష్టాలు ఇబ్బందులు కళ్లకు కట్టినట్టు చూపించారని తెలిపారు. ఇది రాజకీయ సినిమా కాదని, రైతుల సినిమా అని, ప్రతిఒక్క రైతూ చూడాల్సిన సినిమా అని అన్నారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోలాకి : థియేటర్ వద్ద నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి : టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని స్థానిక జిల్లా ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. లింగ వివక్ష, పనిచేసే ప్రదేశంలో స్త్రీలపై లైంగిక వేధింపులు వంటి అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని అన్నారు.

అమర జవాన్లకు నివాళి

టెక్కలి : పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకి టెక్కలి తైక్వాండ్ కోచింగ్‌కి చెందిన క్రీడాకారులు గురువారం నివాళ్లర్పించారు. ఈ మేరకు ఇందిరాగాంధీ కూడలి వద్ద అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్ నర్సిపురం శేఖర్, బోడ్డ గేయామృత, తాస్వి, పి.అక్ష, మనీష్, మోహిత్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

భవన నిర్మాణానికి శంకుస్థాపన

రణస్థలం: మండలం సూరంపేటలో ఎంపిపి స్కూల్ అదనపు భవనానికి కొవ్వాడ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిధులు రూ.16లక్షలతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొవ్వాడ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, పాతర్లపల్లి పంచాయతీ సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, వైసిపి నాయకులు మహంతి అయ్య, లోలుగు కృష్ణ, ముర్తామేస్త్రి, స్కూల్ కమిటీ చైర్మన్ జగ్గురోతు చిన్నకృష్ణ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

టెక్కలి రూరల్ : వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆవులు వేణుగోపాల్ ఎన్నుకున్నట్లు ప్రకటనలో తెలిపారు. వికలాంగుల సమస్యలపై నిత్యం పోరాడుతున్నానని, ఇప్పటికే అనేక సమస్యలపై పోరాటం చేసి విజయం సాధించామని చెప్పారు. వికలాంగులకు రూ.6 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఇళ్ల స్థలం, కట్టుకునేందుకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

నాసా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నాసా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

స్థానిక రవీంద్ర భారతి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు మే నెల 22 నుంచి 26 వరకు లాస్ ఏంజిల్స్ కాలిఫోర్నియాలో నిర్వహించనున్న అంతర్వాతం సమ్మేళనంతో ప్రదర్శించనున్న సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శనకు ఎంపికయ్యారని పాఠశాల నాసా ఆంధ్రా జోకల్ ఇన్‌ఛార్జి ఎస్.వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడూ ఏటా నిరసాంలో బింగే సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనకు తమ విద్యాసంస్థల ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ ఏడాది ద్వియ్యతియర్, శృత్రిమ, పృథ్వీ, ఆకాష్, జుమ్స్, ఫోనిక్స్ వంటి 14 ప్రాజెకులతో తమ విద్యార్థులు హజరు కానున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు జోనల్ ఇన్‌ఛార్జితో పాటు ప్రిన్సిపాల్ జి.కె.నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - జి.సిగడాం

ప్రశంసాపత్రం అందుకుంటున్న ఇందు

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు జి.సిగడాం కెజిబివి విద్యార్థిని ఎస్.ఇందు ఎంపికైంది. గురువారం ఐతమ్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పరిశ్రమల వద్ద విడుదల చేసే కార్బన్ వాయువును ప్యూరిఫైడ్ చేసి గాలిలోకి వదలడం ఎలా అనే ఎక్సురిమెంట్‌ను చేసి జిల్లా స్థాయిలో గెలుపొందారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కి ఎంపిక అవ్వడంతో విద్యార్థిని, సైన్స్ టీచర్ విజయకుమారిని కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, సిబ్బంది అభినందించారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని గుణుపల్లి పెద్దవీధి సిసి రోడ్డు పనులకు సర్పంచ్ తిర్రి కామేశ్వరి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి అప్పలరాజు సహకారంతో ఎన్నో ఏళ్లుగా సిసి రోడ్డుకు నోచుకోని పెద్దవీధిలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని అన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల విప్ తిర్రి గుణవతి, సర్పంచ్ ప్రతినిధి టి.లక్ష్మీనారాయణ, ఎంపిటిసి టి.రాజారావు, గ్రామ వైసిపి అధ్యక్షుడు కోడి నిరంజన్, సూరాడ బాలకృష్ణ, సూరాడ మాధవరావు, చొక్కర శ్రీను, మద్దు రామకృష్ణ పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కామేశ్వరి

నిరుపేద జంటలకు సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలోని బట్టి వలస గ్రామంలో నిరుపేద గిరిజన జంటలకు స్థానిక గ్రామస్తులు వేమూరి కోటేశ్వరరావు సహాయంతో బుధవారం రాత్రి సామూహిక వివాహాలు జరిపించారు. వేద పండితులు విద్యా గాయత్రి ఉపాసకులు ఎస్ హేమ సుందరాచార్యులు ఆధ్వర్యంలో మాంగల్య ధారణ కార్యక్రమాలు జరిగాయి. 9గంటలకు ఒకే చోట స్థానిక ఆంజనేయ దేవాలయ ప్రాంగణంలో వివాహాలు జరపడం ఆనందంగా ఉందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. నూతన వధూవరులకు వివాహానికి అవసరమైన అన్ని సామాగ్రిలు ఉచితంగానే నిర్వాహకులు అందజేశారు. ఈ వివాహ వేడుకలో పెద్ద ఎత్తున గ్రామస్తులు చుట్టుపక్క గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారి మార్కెట్, మున్సిపల్ పరిధిలో గల పలు ఏరియాలలో రోడ్డు మార్జిన్ అశీలు వసూళ్లు చేసుకునేందుకు గురువారం నిర్వహించిన వేలం పాటకు ఎవరూ రాకపోవడంతో ఫిబ్రవరి 20వ తేదీన ఉదయం 11 గంటలకు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం తెలిపారు. అదే రోజు మున్సిపల్ వాణిజ్య భవన సముదాయంలో ఉన్న 22, 34, 36, 44, 45 నెంబర్ల షాప్‌లకు అద్దె ప్రాతిపదికన వేలంపాట నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటను బహిరంగంగా నిర్వహిస్తామని వేలంపాటలో పాల్గొనేవారు రూ.5 లక్షలు సాల్వెన్ సర్టిఫికేట్‌తో పాటు రూ.4 లక్షలు ధరావత్తు మున్సిపల్ రెవెన్యూ అధికారులకు అందజేసి వేలం పాటలో పాల్గొనాలని, పూర్తి వివరాల కోసం కార్యాలయంలో పనిచేసే వేళలలో సంప్రదించాలని కోరారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండలంలోని దశమంతపురంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత గురించి ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్ విద్యార్థులకు వివరించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఓటు హక్కు చాలా విలువైనదన్నారు. ఓటరు మంచి పాలకులను ఎంపిక చేసుకుని గెలిపించుకోవచ్చని అన్నారు. ఓటు హక్కు అనేది వజ్ర ఆయుధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోధకులు శంకరరావు, తవుడు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

గుమ్మలక్ష్మీపురం: గత మూడు రోజులుగా మండలంలో ఎండలు తీవ్రత రోజురోజుకు అధికమవుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండల ప్రభావంతో రోజువారి ఉష్ణోగ్రత 36 డిగ్రీల వరకు నమోదవుతుంది. ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతుంటే మార్చి, ఏప్రిల్, మే నెలలో మరింత తీవ్రత ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల ప్రభావంతో ఉపాధి హామీ వేతనదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పనుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతంపేట: మండల కేంద్రానికి చుట్టు పక్కల గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎఇ జి నీలిమ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ మరమ్మత్తులు, లైన్ ఏ.బి స్విచ్ పనులు, మరమ్మతుకు గురైన స్తంభాలను మార్చడం వల్ల ఈ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

మామిడితోటకు మజ్జిగ ద్రావణం పిచికారీ

మజ్జిగ ద్రావణం పిచికారీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పూత, పిందె రాలకుండా, అన్ని రకాల తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ ద్రావణం పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి హేమ సుందర్ రైతులకు సూచించారు. మండలంలో దేరసాంలో మైలపల్లి తిరుమలరావు మామిడి తోటకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పుల్లటి మజ్జిగ, కొబ్బరి నీళ్ల ద్రావణాన్ని పూత, పిందె రాలకుండా నివారణ స్ప్రేయర్‌తో పిచికారి చేశారు. ఎకరా విస్తీర్ణానికి మొదటగా రెండు లీటర్ల పాలను వేడి చేసి చల్లార్చి తోడు పెట్టి రెండు రోజుల అనంతరం బాగా చిలకరించి వెన్న మొత్తాన్ని తీసి, ఆ మజ్జిగను ఆరురోజులు పులిసిన తరువాత ఏడవ రోజు రెండు లీటర్ల కొబ్బరి నీళ్ల ఇలా తయారైన ద్రావణాన్ని ఎకరాకు సరిపడు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ విధంగా చేయడం వలన అన్ని రకాల తెగుళ్లను, పూతను, పింజెలను రాలకుండా నియంత్రించవచ్చునని, మంచి నాణ్యతగా తయారవుతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయాలనుకుంటే కషాయాలు, ద్రావణాలు, ప్రకృతి ఎరువులు తయారు చేసుకోవాలనుకుంటే ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కంబవ్వ కృష్ణ తెలిపారు. రైతులు 9000946694 నెంబరుకి ఫోన్ చేస్తే సూచనలు, సలహాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

కుమార్‌నాయక్‌కు అవార్డు

ప్రజాశక్తి- పలాస

పలాసకు చెందిన ఉత్కలాంధ్ర కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్‌కు ఉత్తమ భీమసేన్ అవార్డు లభించింది. ఒడిశా నాటక దినోత్సవం సందర్భంగా ఆల్ ఒడిశా సీనియర్ ఆర్టిస్టు ఫెడరేషన్ సౌజన్యంతో బరంపురం ప్రకాష్ మహల్‌లో బుధవారం రాత్రి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో మహాభారత కురుక్షేత్రంలో భీమసేను పాత్రధారి ఉత్కలాంధ్ర కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్ కు ఉత్తమ భీమసేన్ అవార్డును నాట్యశ్రీ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు భవానీశంకర్ మిశ్రా, ఆల్ ఒడిశా ఆర్టిస్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రోషన్ సుభాష్ సాహు' యూనివర్సిటీ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ ఆచార్య

అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్

చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కురుక్షేత్రంలో భీముని ప్రతిజ్ఞ పాండవ వృత్యు బాణాలు ఐదింటిని తస్కరించడం వేదికపై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉత్కల్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తిరుపతిసాహూ, రమేష్ మహారాణా, రాజేంద్రపతి, బిపిన్ చంద్ర మహాపాత్ర, శంకర్ సేన్ సబత్ పాల్గొన్నారు.

బిజెపి రైతు వ్యతిరేకి

ఆమదాలవలస: కేంద్రంలో బిజెపి రైతు వ్యతిరేక ప్రభుత్వమని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. గురువారం మండలం కొర్లకోటలో విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతుల డిమాండ్లను తక్షణమే కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో దేశ రాజధాని సరిహద్దుల్లో మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రైతులు చేసిన పోరాటాలతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి వారి డిమాండ్లను అంగీకరించిందని, నేటికీ అమలు చేయకపోవడంతో మళ్లీ నేడు రైతులు పోరుబాట పట్టారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను బిజెపి ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తుందన్నారు. రైతు దేశానికి వెన్నెముక అన్న నిజాన్ని మరచి రైతు వెన్ను విరుస్తున్న ఈ

మాట్లాడుతున్న అన్నాజీరావు

ప్రభుత్వంపై తక్షణమే ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. రైతులపై కేంద్ర బలగాలు వ్యవహరిస్తున్న తీరు సరికాదని, తక్షణమే ఆ చర్యలను నిలిపివేసి రైతుల కోరుతున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలబడి పోరాడుతుందని హెచ్చరించారు.

పాత్రికేయులపై భౌతిక దాడులు హేయమైన చర్య

మాట్లాడుతున్న చెన్నయ్య

ప్రజాశక్తి- రణస్థలం

పాత్రికేయులపై భౌతిక దాడులను మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తుందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కె.సి.చెన్నయ్య అన్నారు. మండల కేంద్రంలో ఒక హోటల్ గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధులుగా ఉన్న పాత్రికేయులపై భౌతిక దాడులకు పాల్పడడం సిగ్గుమాలిన చర్యన్నారు. విలేఖరులపై దాడులు చేయడంతో వాస్తవాలను, వార్తలను ఆపలేరని, బెదిరింపులకు పాల్పడితే, దాడులకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు. వార్త కథనాలపై ఏమైనా సందేహాలు వుంటే తెలియజేయాలని, వాటిని ఖండించాలన్నారు. జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన వారి ఇంటిని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. పోలీస్ యంత్రాంగం జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, దాడులు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాల మహానాడు సభ్యులు, కుపులి సీతప్పడు, చిన్నబాబు, సూరపురు కృష్ణవేణి, మాజీ సర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు.

అబద్ధాల ఘనాపాటి విజయచంద్ర

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంరూరల్: స్థానిక నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర తనపై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు తిప్పికొట్టారు. గురువారం ఆయన మాట్లాడుతూ బోనెల విజయ చంద్ర అబద్ధాలు ఆడటంలో ఘనాపాటి అని, సొంత ఊరికి సేవ చేసేందుకు వచ్చానని చెప్పే ఆయన నరిసిపురంలో 2019లో ఓటు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పుడెందుకు మూడు నెలల ముందు వెంకంపేట పోలింగ్ బూత్‌లో నమోదు చేసుకున్నారని ప్రశ్నించారు. ఇప్పుడే ఇన్ని అబద్ధాలు చెప్పేవాడిని, ముందుముందు ఇంకెన్ని అబద్ధాలు చెప్పి పార్వతీపురం ప్రజలను నట్టేట ముంచుదాం అనుకుంటున్నారని అన్నారు. టిడిపి నాయకుడు బర్నాల సీతారాం పట్టణంలో ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని చూపుతామని , జెసిబితో దాన్ని కూల్చి ప్రభుత్వ పరం చేయాలని అన్నారు. గతంలో విజయ చంద్ర చేసిన వివిధ సంఘాలు, వ్యక్తులకు మోసగించి కోట్లాది రూపాయలు స్వాములు పూర్తి బండారాలు, అక్రమ ఆర్థిక లావాదేవీల అకౌంట్లతో సహా త్వరలో ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

టెక్కలి రూరల్ : జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. కొత్తగా నిర్మాణం చేపట్టిన స్వగృహంలో సోషల్ మీడియా కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. వైసిపి అధికారంలోకి వచ్చేలా సోషల్ మీడియా కన్వీనర్లు పనిచేయాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కవిటి: మండలంలోని బి.జి.పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ భవిష్యత్‌లో సాధించే విజయాలకు పదో తరగతి మొదటి మెట్టని అన్నారు. విద్యార్థులు ఎటువంటి ఆకర్షణలకు లొంగకుండా విజయతీరాలకు చేరాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డాన్స్ చేస్తున్న విద్యార్థులు

రైతులపై లాఠీఛార్జికి ఖండన

పలాస : రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరలు కల్పించాలని, ఎంఎస్‌పి చట్టం చేయాలని, మోడీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రైతాంగం నిరసన ప్రదర్శన చేస్తున్నారని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు అన్నారు. శాంతి నిరసన ప్రదర్శనపై పోలీసులు అమానుషంగా జరిపిన లాఠీఛార్జిని తీవ్రంగా ఖండిస్తున్నారని అన్నారు. ఈ మేరకు పలాసలోని గురువారం విలేకరులతో మాట్లాడారు. డ్రోన్లతో రైతులపై భాష్ప వాయువులను ప్రయోగించడం సరికాదన్నారు. రోడ్లపై భారీ గోతులను తవ్వి ట్రాక్టర్లు రాకుండా భారీ ఇనుప సీలలను నాటించడం హేయమైన చర్య అని అన్నారు.

రోగులతో మాట్లాడుతున్న భూదేవి

భూదేవి పరామర్శ

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులను పాలకొండ నియోజకవర్గం టిడిపి నాయకులు నారీ శక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి గురువారం రాత్రి సందర్శించారు రోగులను పరామర్శించారు గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు సకాలంలో వైద్య సేవలు అందించాలని కోరారు గ్రామాల్లో పౌష్టికాహారం లోపం వలన రక్తహీనతకే గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు గిరిజనులకు విద్యార్థులకు, గర్భిణీలకు చిన్నారులకు బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించాలని అన్నారు . ఏరియా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన టెస్టులు అన్ని వైద్య సేవలు ఉండాలని అన్నారు.మందులు కొరత లేకుండా చూడాలన్నారు.

20న వాహనాల వేలం

పార్వతీపురం టౌన్: స్థానిక పోలీస్ స్టేషన్లో నాటు సారా రవాణా చేస్తూ పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 20న వేలం వేయనున్నట్లు సిఐ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈనెల 20న స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ లో 6 ద్విచక్ర వాహనాలు (ఒక స్కూటీ, 05 మోటర్ సైకిల్) 1 కారు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనే వారు ఆ రోజు ఉదయం 11.00 గంటలకు పోలీసు స్టేషనుకు వచ్చి, వాహనానికి నిర్ణయించిన కనీస ధరకు తక్కువ కాకుండా నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొని, వాహనాలను కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. పార్వతీపురం ఎఎస్‌పి సునీల్ షరాన్ సమక్షంలో ఈ వేలంపాట జరుగుతుందన్నారు. 16న నిర్వహించాల్సిన వేలంపాట అనివార్య కారణాల వల్ల ఈనెల 20కి మార్చినట్లు తెలిపారు.